




T/TG/2024/0523/7229/1544

# ఆకాంక్ష

తెలుగు డైలీ దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

'ఆకాంక్ష' దినపత్రికలో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను

Web Site : akankshanews.com

M : akankshanewsdaily@gmail.com

ఆకాంక్ష దైలీ దినపత్రిక

స్టాఫ్ రిపోర్టర్లు

నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

ఎడిటర్ : పెనగొండ సతీష్, సెల్ : 8333818121

చీఫ్ ఎడిటర్ దాట్ల జెమ్సరెడ్డి సెల్ : 9059188532



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 07 ఎడిటర్ :పెనుగొండ సతీష్ బుధవారం 23 ఏప్రిల్ 2025 పేజీలు 4 వెల 5.00




### భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు

# అందించేందుకు సిద్ధం

- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటన
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలుబీ వాణిజ్యం, రక్షణపై దృష్టి
- భారత్–అమెరికా వాణిజ్య ఒప్పంద చర్చల విధివిధానాలు ఖరారు
- జైపూర్‌లో వాన్స్ ప్రసంగం
- ఇరుదేశాల వృద్ధికి ట్రంప్ ప్రాధాన్యత ఇస్తున్నారని వెల్లడి

(ఏప్రిల్ 22) : భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక (మిగతా 2వ పేజీలో)

# ప్రజాస్వామ్యంలో



## పార్లమెంట్ సుప్రీమ్

- రాష్ట్రపతిని నిర్దేశించే అధికారం సుప్రీంకులేదు
- తన వ్యాఖ్యలను సమర్థించుకున్న ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, (ఏప్రిల్ 22) : చట్టాలు చేయడం, సమస్యలు చర్చించడం ద్వారా పార్లమెంట్ మన ప్రజా స్వామ్యంలో అత్యున్నతమైన సంస్థ అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. అన్నింటికీ పార్లమెంటును మించినది ఏదీ లేదని.. పార్లమెంటే అత్యున్నతమైనదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు రాష్ట్రాల గవర్నర్లు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టడంపైన ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నర్లు గానీ, రాష్ట్రపతి గానీ శాసనసభ ఆమోదించిన బిల్లులను నిర్దేశ గడువులోపే పరిశీలించి ఆమోదిం చాలని తీర్పునిచ్చింది. గవర్నర్ రాష్ట్రపతికి బిల్లులని పంపినా.. మూడు (మిగతా 2వ పేజీలో)

### హిరోషిమాను సందర్శించిన

# సీఎం బృందం

## - అణుదాడి మృతులకు నివాళి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,ఏప్రిల్22 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారంజపాన్ లో బిజీబిజీగా గడిపారు. పెట్టుబడులు రాబట్ట డమే లక్ష్యంగా జపాన్ వెళ్లిన తెలంగాణ రైజింగ్ టీమ్ హిరోషిమా నగరాన్ని సందర్శిం చింది. సీఎం రేవంత్రెడ్డి మంత్రి శ్రీధరా బాబుతో కలిసి జాతిపిత, శాంతిదూత మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం హిరోరోషి మా పీస్ మెమోరియల్ పార్క్, అటామిక్ బాంబ్ డోమ్ ను వారు సందర్శించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణు బాంబు దాడిలో మరణించిన వారి స్మృతి చిహ్నం వద్ద పూలమాల వేసి సీఎం రేవంత్ రెడ్డి నివాళు లర్పించారు. హిరోషిమా అసెంబ్లీని కూడా సందర్శించారు. సిఎం రేవంత్ బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌ను సందర్శించింది. హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ హాల్ సందర్శనకు వెళ్లిన బృందానికి అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, వారి శాసనసభ్యుల 2లో



## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

- మరోమారు సత్తా చాటిన అమ్మాయిలు
- ఫస్టియర్ ఫలితాల్లో 65.96 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్‌లో 65.65 శాతం ఉత్తీర్ణత నమోదు
- ఫలితాలు విడుదల చేసిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, ఏప్రిల్ 22 : తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడుదల య్యాయి. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో అమ్మాయిలు సత్తా చాటారు. ఫస్టియర్ ఫలితాల్లో 65.96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 73.83 శాతం, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,88,430 మంది హాజరు కాగా 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 65.65 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, బాలికలు 74.21 శాతం, బాలురు 57.31 శాతం ఉత్తీర్ణ త సాధించారు. సెకండియర్ పరీక్షలకు 5,08,582 మంది హాజరు కాగా, 3,33,908 మంది ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫలితాలను విడదల చేశారు. గతం కన్నా ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఈ సారి ఇంటర్ ఫలితాలలో బాలికలదే హవా కొనసాగింది. 2లో

# భూమికి భద్రత భూభారతి

- ప్రజల చెంతకు ప్రభుత్వం
- భూ భారతితో సమస్యలకు పరిష్కారం
- పైలట్ ప్రాజెక్ట్‌గా మండలానికి ఒక గ్రామం ఎంపిక



(ఆకాంక్ష న్యూస్)

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 22 : ఎన్నో ఏళ్లుగా లక్షలల్లో పేరుకు పోయిన భూ సమస్యలకు భూ భారతితో పరిష్కారం లభించ నున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వలిగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి (ఆర్ఓఆర్) చట్టంపై అవగాహన కొరకు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరికల్ శాసనసభ్యులు వేముల వీరేశంలు పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణం, సమాచార, పౌరసం బంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి ఈ సదస్సులో పాల్గొన్నారు. తదనం తరం భూ భారతి కరపత్రాలను ఆవిష్కరిం చారు. సభ ప్రారంభానికి ముందుగా భూ భారతి (ఆర్ఓఆర్) చట్టం పై జిల్లా కలెక్టర్ హనుమంతరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేసి చట్టంలోని ప్రతి ఒక్క అంశాన్ని సమగ్రంగా వివరించారు. 2లో

## రైతుల గురించి మాట్లాడే అర్హత బిఆర్‌ఎస్‌కు లేదు

### – పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

(ఆకాంక్ష న్యూస్)



నిజామాబాద్, ఏప్రిల్22 : నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించటమే రైతు మహోత్సవం ప్రధాన లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు. నిజాం సాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల పూడికను తీయటానికి త్వరలో టెండర్లు పిలుస్తామని ఆయన వెల్లడించారు. అయితే, బీఆర్ఎస్ రైతుల వ్యతిరేక పార్టీ.. బీఆర్ఎస్ రైతులను నట్టేటా ముంచిందని ఆరోపించారు. రైతుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ ఎస్ పార్టీకి లేదని ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మాది రైతు ప్రభుత్వం.. అందుకే నిజామాబాద్‌లో రైతు మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లాలో కొత్త షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ తెలిపారు. 10 ఏళ్ళల్లో నిజామాబాద్ జిల్లాకు బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందో కేటీఆర్, కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. 2లో

## భూభారతి చట్టం అమలు బాధ్యత కలెక్టర్లదే

### కలెక్టర్లను ఆదేశించిన మంత్రి పొంగులేటి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, ఏప్రిల్22 : ప్రభుత్వ ఆలోచనలు, ప్రాధాన్యతలకు అను గుణంగాపనిచేయాలనిరాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీ నివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశిం చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టా త్మకమైన ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి చట్టం అమలుపై కలెక్టర్లు మరింత ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి 2లో

## చిత్ర పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం

### గద్దర్ అవార్డుల ఏర్పాటు అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



2లో

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి

9.5 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. గత నెల 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మొత్తం 9.97లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఇక రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను ఇంటర్‌బోర్డు వెల్లడించింది. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్ జిల్లా 77.21 శాతంతో మొదటి స్థానంలో.. 48.43 శాతంతో మహబూబాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచాయి. ద్వితీయ సంవత్సరంలో ములుగు జిల్లా 80.12 శాతంతో టాప్‌లో ఉండగా.. కామారెడ్డి జిల్లా 54.93శాతంతో చివరి స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇంటర్ పాసైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేసారు. భవిష్యత్‌లో కూడా విద్యార్థులంతా వారి ఉన్నత విద్య కోసం ఇంకా అడుగులు ముందుకు వేయాలని, వారి జీవితాల్లో అత్యుతన్నత స్థానాకలు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నటలు వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా జపాన్ పర్యటనలో ఉండి.. వారు నా ద్వారా ఈ సందేశాన్ని ఇవ్వాలని ప్రత్యేకంగా చెప్పారు. విద్యార్థులందరికీ సీఎం రేవంత్ తరపున అభినందనలు.. వారి భవిష్యత్ కోసం విద్యాశాఖ నిరంతరం పని చేస్తుందని సీఎం స్పష్టంగా తెలియజేయాలని కోరారు. విద్యార్థులందరికీ దగ్గరుండి బోధించిన అధ్యాపకులకు, పారదర్శకంగా ఫలితాలు ప్రకటించిన బోర్డుకు హృదయపూర్వకమైన అభినందనలు తెలియజేస్తున్నాని తెలుపుతూ భట్టి తన ప్రసంగాన్ని ముగించారు. ఇంటర్ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించామని



బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. 19 కేంద్రాల్లో పేపర్ల వాల్యూయేషన్ చేపట్టామన్నారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు వారం గడువు ఇస్తున్నట్లు– చెప్పారు. మే 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రీ వెరిఫికేషన్‌కు రూ.600, రీ కౌంటింగ్‌కు రూ.100 ఫీజుగా నిర్ణయించినట్లు చెప్పారు. ఏప్రిల్ 23 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు పేపర్‌కు రూ. 100 చొప్పున, రీవెరిఫికేషన్‌కు పేపర్‌కు రూ. 600 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలావుంటే ఇంటర్ పరీక్షల ఫలితాల విడుదల కోసం ముగ్గురు మంత్రులు రావడం, వారు కలిసి విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా విద్యాశాఖ మంత్రి ఇంటర్ ఫలితాలను విడుదల చేస్తారు.

## చిత్ర పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, ఏప్రిల్ 22 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలుగు చిత్రాలను మాత్రమే కాదు.. ఉర్దూ చిత్రాలను కూడా ప్రోత్సహిస్తామని తెలిపారు. గద్దర్ మంగళవారం చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్‌ఆర్‌ఎస్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రిమాట్లాడుతూ ప్రజలకు అవసరమైన చిరస్మరణీయమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని ఈ చట్టాన్ని అమలు చేయవలసిన బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టంచేశారు. భూభారతి చట్టంపై పైపైనే కాకుండా లోతుగా అధ్యయనం చేసి ప్రజల్లోకి వెళ్లాలని కలెక్టర్‌సకు సూచించారు.

తెలంగాణ చలన చిత్ర అవార్డులపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ గుండె చప్పుడును తన పాటల ద్వారా విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ గద్దర్ బాణి, పాటలను అనుకరిస్తారు. గద్దర్ తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. ఆయన పేరు మీద అవార్డులు ప్రదానం చేయడం హర్షణీయం. హైదరాబాద్‌లో జరిగే చలన చిత్ర అవార్డులు ఘనంగా నిర్వహించాలి. అందుకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందిస్తామని అన్నారు. జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు. హెచ్‌ఐసీసీ వేదిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఈ పురస్కారాల ఎంపిక కోసం 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. జ్యూరీ కమిటీకి ఛైర్పర్సన్‌గా నటి జయసుధను ఎంపిక చేశారు. అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లు రాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు ఇటీవల వెల్లడించారు. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ప్రస్తుతం జ్యూరీ సభ్యులు పరిశీలిస్తున్నారు.

## రైతుల గురించి మాట్లాడే అర్హత బిఆర్‌ఎస్‌కు లేదు

మొదటిపేజీ తరువాయి

ఇక, బీఆర్ఎస్ పని అయిపోయింది.. మళ్ళీ మాదే అధికారం, రాబోయే ఎన్నికల్లో 90 నుంచి 100 సీట్లు– గెలిచి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. అలాగే, కేసీఆర్ ఫామ్ హౌస్ కి పరిమితం అయ్యారు.. ఇన్ డైరెక్ట్ గా బీజేపీకి మద్దతిచ్చి బీఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుంది అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ ముఖ చిత్రంలో బీఆర్ఎస్ అనేది ఉండదని మహేష్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు.

## హిరోషిమాను సందర్శించిన సిఎం బృందం

మొదటిపేజీ తరువాయి

బృందం ఘనంగా స్వాగతించింది. ముఖ్యమంత్రి వెంట ఐటీ–, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, అధికారులు జయేష్ రంజన్, వి. శేషాద్రి, అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి అసెంబ్లీని సందర్శించారు. శాసనసభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'హిరోషిమాకు రావటం గౌరవంగా ఉంది. హిరోషిమా అంటే ఆశ. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. హిరోషిమా మాదిరిగానే ప్రజలు ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం' అని అన్నారు. 'శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని మంత్రి శ్రీధర్బాబు హిరోషిమా ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. పెట్టు–బడులకు కాకుండా పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చామని, కలిసికట్టు–గా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని అన్నారు. ఇప్పటికే యాభైకి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పనిచేస్తున్నాయని, మరిన్ని కంపెనీలను మంత్రి స్వాగతించారు. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ర్ మొబిలిటీ–, ప్రిసిసన్ మ్యానుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో గొప్ప అవకాశాలున్నాయని అన్నారు. తెలంగాణను సందర్శించి, రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు.

## భారత్ కు ఎఫ్-35 యుద్ధ విమానాలు అందించేందుకు సిద్ధం

సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చల విధివిధానాలు ఖరారయ్యాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రకటించారు. తన భారత పర్యటనలో భాగంగా జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీల దార్శనికతను సాకారం చేయడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. అమెరికా, భారత్ రెండూ అభివృద్ధి చెందాలని ట్రంప్ కోరుకుంటున్నారని వాన్స్ స్పష్టం చేశారు. భారత్‌తో న్యాయమైన వాణిజ్య భాగస్వామ్యాన్ని ట్రంప్ ప్రభుత్వం కోరుకుంటుందని, భాగస్వామ్య దేశాలతో మంచి ఒప్పందాలు చేసుకోవడానికి అమెరికా సిద్ధంగా ఉందని వాన్స్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. భారత్‌కు అమెరికా ఇంధనంతో పాటు, అత్యాధునిక ఎఫ్35 యుద్ధ విమానాలను విక్రయించడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సోమవారం రాత్రి ఢిల్లీ నుంచి జైపూర్ చేరుకున్న జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్, వారి ముగ్గురు పిల్లలు ఇవాన్, వివేక్, మిరాబెల్‌లకు రాజస్థాన్ ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. మంగళవారం ఉదయం వారు చారిత్రక ఆమెర్ కోటను సందర్శించారు. ఈ సందర్భంగా రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, ఉప ముఖ్యమంత్రి దియా కుమారి వారికి స్వాగతం పలికారు. అలంకరించిన ఏనుగులు, రాజస్థానీ సంప్రదాయ నృత్యాలు, కళారూపాలతో వాన్స్ కుటుంబానికి ఆత్మీయ ఆహ్వానం లభించింది. వారి పర్యటన నేపథ్యంలో ఆమెర్ కోటను సందర్శకులకు 24 గంటల పాటు మూసివేశారు. అంతకుముందు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో జేడీ వాన్స్ విస్తృత స్థాయి చర్చలు జరిపారు. రక్షణ సహకారం, ఇంధనం, ఆధునిక సాంకేతికతలు, వాణిజ్య సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇరు దేశాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (BTA) చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించడాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. భారత్‌కు తాము భాగస్వాములుగా వచ్చామని, సంబంధాలను బలోపేతం చేసుకోవడమే తమ లక్ష్యమని జైపూర్ ప్రసంగంలో వాన్స్ అన్నారు. "గతంలో కొన్నిసార్లు వాషింగ్టన్ ప్రధాని మోదీకి బోధించే వైఖరితో వ్యవహరించింది. మేము దానికోసం ఇక్కడకు రాలేదు," అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీకి ఉన్న ప్రజాదరణ అమోఘమని, ఆయన రేటింగ్‌లు తనకు అసూయ కలిగించేలా ఉన్నాయని తాను మోదీతో అన్నట్లు వాన్స్ తెలిపారు.

## భూభారతి చట్టం అమలు బాధ్యత కలెక్టర్లదే

మొదటిపేజీ తరువాయి

భూభారతి పైలట్ ప్రాజెక్ట్ అమలుచేస్తున్న నాలుగు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలకు గాను 16 గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని, ఇప్పటివరకు ఈసదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో 1076, నారాయణపేట జిల్లా మద్దూర్ లో 233, కామారెడ్డి జిల్లా లింగంపేట 810, ములుగు జిల్లా వెంకటాపురంలో 3786 మొత్తం 5,905 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా పైలట్ మండలాల్లో రెవెన్యూ సదస్సులను పూర్తిచేయాలని కలెక్టర్లకు సూచించారు. ఈ నాలుగు పైలట్ మండలాల్లో వచ్చిన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని మే మొదటి వారంలో హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లోని ఒక్కో మండలాన్ని పైలట్ మండలంగా తీసుకొని 28 మండలాల్లో భూభారతి చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. దీనికిముందు ఆ నాలుగు మండలాల్లోని తహశీల్దార్ నేతృత్వంలోని అధికారుల బృందం, ఈ 28 మండలాల్లోని తహశీల్దార్, డిప్యూటీ– తహశీల్దార్, మరో ఇద్దరు అధికారులకు భూభారతి చట్టంపై వర్క్‌షాపు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 605 మండలాలకు గాను 159 మండలాల్లో భూభారతిపై అవగాహనా సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. సిసిఎల్ఎ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను కూడా పైలట్ మండలాల్లోని రెవెన్యూ సదస్సులలో చేర్చాలని సూచించారు. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మే మొదటివారంలోగా పూర్తిచేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేయాలని, 200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలని, అనర్హులను ఎంపిక చేస్తే ఆ గెజిటెడ్ అధికారిదే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగితేనే డబ్బులు విడుదల చేయాలని సూచించారు. నిర్మాణదశలను బట్టి లబ్ధిదారులకు ప్రతిసోమవారం నాడు వారి ఖాతాలోనే నేరుగా డబ్బులను జమచేయాలని సూచించారు. లబ్ధిదారులకు తక్కువ ధరకు స్టీల్ సిమెంట్ ఇచ్చేవిధంగా త్వరలో పరిశ్రమల శాఖామంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

## భూమికి భద్రత భూభారతి - ప్రజల చెంతకు ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... భూ భారతి చట్టాన్ని పటిష్టంగా అమలు పరిచేందుకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ మినహాయించగా మిగిలిన 32 జిల్లాలలో 4జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసామని, ఆయా జిల్లాలలో జిల్లాకు ఒక మండలము ఎంపిక చేసి భూ భారతి (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) చట్టం అమలు చేస్తున్నామన్నారు. 2025, మే 1వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా మిగతా 28 జిల్లాలోనూ జిల్లాకు ఒక మండలము ఎంపిక చేసి భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు పరుస్తామన్నారు. గతంలో సాదా బైనామా ధరణిలో అవకాశం లేకపోవడంతో కోర్ట్ కూడా ఏమీ చేయలేకపోయిందని అన్నారు. ధరణి క్రింద స్వీకరించిన పరిష్కారం కాని 9.26 లక్షల దరఖాస్తులను భూభారతి లో పరిష్కరిస్తామన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ రెవెన్యూ, ఫారెస్ట్, భూదాన్,వక్ఫ్, దేవాదాయ భూములపై పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందించవచ్చునని, ఆక్రమించిన వారు ఎవరైనా విడిచిపెట్టే ప్రసక్తి లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు 10లక్షల వరకు వైద్య సదుపాయాలు, 200 వాట్స్ ఉచిత విద్యుత్, 500 రూలకే వంటగ్యాస్ సిలిండర్, ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం తో పాటు 6వేల కోట్లు వెచ్చించి ధనికులతో సమానంగా నిరుపేదలు కూడా సన్నబియ్యం తో కడుపునిండా భోజనం చేయాలని గొప్ప ఉద్దేశ్యం తో సన్నాలు పండించిన రైతులకు బోనస్ గా 500 రూ.లు బోనస్ ఇవ్వడం జరిగిందన్నారు. రైతును రాజు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. శిథిలావస్థకు చేరుకున్న తహశీల్దార్ కార్యాలయాల నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు కోరిక మేరకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ...ధరణిలో అప్పీల్ వ్యవస్థ లేదని, నేరుగా కోర్ట్ కు మాత్రమే వెళ్ళవలసి వచ్చేదన్నారు. భూభారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థ ఉండడం ద్వారా సమస్యలు పరిష్కార మవుతాయని, చట్టం అమలు పరిచేందుకు తహసీల్దార్ లు రెవెన్యూ సిబ్బందితో గ్రామాలకు వస్తారని, దరఖాస్తు స్వీకరించడమే కాకుండా పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తారని, లేని పక్షంలో ఆర్డీఓ కు అప్పీల్ చేసుకోవచ్చునని, అప్పటికీ పరిష్కారం కాకపోతే కలెక్టర్ ను కలవాల్సి ఉంటుందన్నారు. సమస్య జటిలం అయితే ఆపై ట్రిబ్యునల్ పరిష్కరిస్తుందన్నారు. ఇకపై భూముల సర్వే నెంబర్లు నమోదు చేయడమే కాకుండా, సర్వేయర్ తో హద్దులు ఏర్పాటు చేయించి మ్యాపులతో సహా భూ రికార్డులలో నమోదు చేస్తూ, కంప్యూటరీకరణ చేస్తామని, భూ భద్రత కై ప్రతి సంవత్సరం డిసెంబర్ మాసంలో సంబంధిత భూ రికార్డులను భద్రపరుస్తామన్నారు. భూ సమస్యలు ఇకపై ఉండవన్నారు. అనంతరం మంత్రికి శాలువా లను కప్పి చిత్రపటాలను అందించి ఘనంగా సన్మానించారు.


## ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ సుప్రీమ్

మొదటిపేజీ తరువాయి

నెలలోపే ఆ బిల్లులను క్లియర్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తమిళనా డుకు చెందిన బిల్లులపై సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ స్పందించారు. పార్లమెంటే సుప్రీం అని..రాష్ట్రపతి విధులకు సంబంధించి ఆదేశాలు ఇచ్చే అధికారం న్యాయవ్యవస్థకు లేదని వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా విమర్శలపై మరోసారి ఆయన స్పందించారు. తాను అన్న వ్యాఖ్యలకు కట్టు–బడి ఉన్నట్లు చెప్పుకొచ్చారు. మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో జగదీప్ ధన్‌కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుపై తాను చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలపై స్పందించారు. రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం తాను మాట్లాడిన ప్రతి మాట.. అత్యున్నతమైన జాతి ప్రయోజనాలతో చేసిందే అని అన్నారు. పార్లమెంటే అత్యున్నతమైనది.. న్యాయవస్థ 'సూపర్ పార్లమెంట్' పాత్రను పోషించలేదు, కార్యనిర్వాహక వర్గంలోకి ప్రవేశించలేదు అని అన్నారు. ఈ మేరకు దేశ సర్వోన్నత న్యాయస్థానంపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు కంటే పార్లమెంటే ఎక్కువ అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్ అని పేర్కొన్నారు. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైంది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. పార్లమెంటే అన్నింటికీ సుప్రీం అని తేల్చి చెప్పారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందని గుర్తుచేశారు. ఇటీవల బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివాదంగా మారింది. నిర్ణీత గడువులోగా రాష్ట్రపతి సమ్మతి తెలపాలని తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా వక్ఫ్ చట్టం తదుపరి విచారణ వరకు వాయిదా వేసింది. ఈ నిర్ణయాలే అధికార పెద్దలకు కోపం పుట్టించింది. ఉప రాష్ట్రపతి దగ్గర నుంచి బీజేపీ నేతలంతా సుప్రీం ధర్మాసనంపై విరుచుకు పడుతున్నారు. సుప్రీంకోర్టే ఆదేశాలు ఇస్తే.. ఇక పార్లమెంట్ మూసేసుకోవడం బెటర్ అంటూ ధ్వజమెత్తారు. ఇక బీజేపీ నేతల వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండించింది. సుప్రీంకోర్టును బీజేపీ నేతలు బెదిరిస్తున్నారంటూ ఆరోపించారు.

# ముఖ్యమంత్రి వచ్చిన రోజే నా పెళ్లికి ముహూర్తం పెట్టుకుంటా...

## - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పెళ్లికి తీసుకురావాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం...


Respected
CM Sir
Please kindly Attend the Marriage
V.V. Important leader
Singareni (M)
Please Any date
do fix.
B. గణేష్.
79937-28076.
M Ramdas
M Ramdas
MLA



ఖమ్మం జిల్లా,(ఆకాంక్ష న్యూస్) : సాధారణంగా ఏమైనా సమస్యలు ఉంటేనో లేక ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనో ఆయా నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వడం సర్వసాధారణంగా మనం చూస్తూనే ఉంటాం. కానీ ఓ నియోజకవర్గానికి సంబంధించిన కాంగ్రెస్ యువజన మండల యూత్ నాయకుడు ఆ నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతి పత్రం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే... ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే మలోత్ రాందాస్ నాయక్ కు కారేపల్లి మండలం మేకల తండాకు చెందిన గణేష్ కాంగ్రెస్ యువజన మండల యూత్ నాయకుడిగా కొనసాగుతున్నాడు. అయితే ఈ మధ్యనే గణేష్ కు పెళ్లికూదిరి నిశ్చితార్థమైంది. అయితే తన పెళ్లికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీసుకురావాలని, ముఖ్యమంత్రికి ఎప్పుడు కుదిరితే అప్పుడే ముహూర్తం పెట్టుకుంటానని వినతి పత్రంలో రాసి ఎమ్మెల్యేకు అందజేశారు. అయితే ఈ వినతి పత్రంపై ఎమ్మెల్యే మలోత్ రాందాస్ నాయక్ సింగరేణి మండల నాయకుడి వివాహానికి హాజరు కావాలని, ఇంపార్టెంట్ లీడర్, ప్లీజ్ డేట్ ఫిక్స్ అని వినతి పత్రం పై రాసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు.

# నేడు పెద్దపల్లి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత పర్యటన



గోదావరిఖని టౌన్ (ఆకాంక్ష న్యూస్) : పెద్దపల్లి జిల్లాలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ప్రసంగించి సాయంత్రం ఐదు గంటలకు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ వేడుకల్లో పాల్గొననున్నారు. అలాగే సాయంత్రం 5:30 గంటలకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ యూనియన్ కేంద్ర కార్యాలయం లో జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. అలాగే 6:30 గంటలకు గోదావరిఖని ఇల్లందు క్లబ్ లో టీపీజీకేఎస్ కోశాధికారి వెంకటేష్ కుమారుడి జన్మదిన వేడుకలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

# భూ భారతి తో త్వరితగతిన సమస్యల పరిష్కారం

## -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష






రామగిరి (ఆకాంక్ష న్యూస్) : నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతి తో భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పాల్గొన్నారు. భూ భారతి చట్టం లోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025 అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని అన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం పై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయం పై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్ళవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని, దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్ లో అప్పీల్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. పిఓటి, ఎల్.టి.ఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు , 100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని, హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని అన్నారు. భూ భారతి చట్టం పై అవగాహన కల్పించేలా కర పత్రాలను పంపిణీ చేశామని, ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్ , రామగిరి తహసిల్దార్ సుమన్, రైతులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రైతుకు గౌరవం పెరిగింది

## - రుణమాఫీ, 5వందల బోనస్ తో రైతు కుటుంబాల్లో ఆనందం

## - రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్





గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వ్యవసాయ రంగానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయని, సమాజంలో రైతులకు కూడా గౌరవం పెరిగిందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. ఈ మేరకు పెద్దంపేట పోచమ్మ గుడి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలాంటి కటింగ్ లు లేకుండా వడ్ల కొనుగోలుకు పగడ్బందీ ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుండి ప్రస్తుతం నాలుగో సారి కటింగ్ లు లేకుండా కొనుగోలు జరుగుతున్నట్టు స్పష్టం చేశారు. వడ్ల సెంటర్లలో ఎలాంటి అవినీతి వ్యవహారాలు జరగకుండా ఎప్పటికప్పుడు తాను డేగ కళ్ళతో పర్యవేక్షణ చేస్తానని అన్నారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో కటింగ్ ల పేరిట రైతులను నిలువునా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి, చెమటోడ్చి పండించిన రైతుల కష్టార్జితాన్ని గత ప్రభుత్వంలోని పెద్దలు కటింగ్ ల పేరిట ఏ విధంగా అవినీతికి పాల్పడ్డారో ప్రజలందరికీ తెలుసని అన్నారు. తాము పూర్తి పారదర్శకంగా రైతులకు న్యాయం చేకూర్చేందుకు పనిచేస్తున్నామని చెప్పారు. సెంటర్లోకి ధాన్యం తీసుకువచ్చి తక్ పట్టీలను పొంది రైతులు నిరంధిగా ఉండవచ్చని, 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి సంక్షేమ పథకాల వల్ల రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లి విరుస్తోందన్నారు. ఈ సారి కూడా సన్న వడ్లకు బోనస్ అందిస్తామని, గత సీజన్ లో సన్న వడ్ల బోనస్ రాష్ట్ర మొత్తం మీద ప్రభుత్వం రైతులకు 1234 కోట్ల రూపాయలు అందించగా, అందులో ఒక్క రామగుండం నియోజకవర్గంలోనే అత్యధికంగా బోనస్ ను రైతులు పొందారని అన్నారు. నియోజకవర్గంలో పెద్దపెట్ రైతులు ఎక్కువగా ప్రయోజనం పొందారని త్వరలోనే అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, అంతర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు .కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజా మాజీ కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

# జీతాలు చెల్లించడం లేదని రోడెక్కిన కార్మికులు




గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : ఆర్ఎఫ్ సీఎల్ ఎరువుల కార్మాగారంలో పని చేస్తున్న మెకానికల్ డిపార్ట్మెంట్ కార్మికులు పెండింగ్ లో ఉన్న జీతా,భత్యాలు వెంటనే చెల్లించాలని ఆర్ఎఫ్ సీఎల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి విధులను బహిష్కరించారు. కార్మికులను ఉద్దేశించి యూనియన్ నాయకులు అంబటి నరేష్ మాట్లాడుతూ.. అహర్నిశలు శ్రమించి పని చేస్తు కంపెనీకి వందల కోట్ల రూపాయల లాభాలను సాధించి పెడుతున్న కార్మికులు జీత భత్యాల గురించి రోడ్డెక్కడం కంపెనీ యాజమాన్యం యొక్క అమానుష చర్యలు పరాకాష్టగా ఉందని అభివర్ణించారు. రెండు మూడు నెలలకు ఒకసారి జీత భత్యాలు ఇవ్వడం అంటే కార్మికులను బానిసలుగా భావిస్తూ ఉద్దేశ పూర్వకంగా ప్రిన్స్ పల్ ఎంప్లోయర్ అయిన ఆర్ఎఫ్ సీఎల్ యాజమాన్యం కార్మిక చట్టాలకు తూట్ల పొడుస్తుందని అన్నారు. వెంటనే కార్మికులకు జీత భత్యాలు కార్మికులకు జమ చేయని యెడల ఉత్పత్తిని స్తంబింప చేసి కార్మికులందరు ప్లాంట్ ముందు ధర్నాకు బైఠాయించుతమని యాజమాన్యాన్ని హెచ్చరిస్తు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రత్నం శ్రీనివాస్. కొమురన్న అఫ్జల్ , తన్నీరు నరేష్ ,రవి , నయీమ్, శ్రీనివాస్, రమేష్ ,ప్రకాష్ , మహేందర్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసానికి 26 నుంచి ఇంటర్వ్యూలు



మంథని, (ఆకాంక్ష న్యూస్) : రాజీవ్ యువ వికాసం పథకానికి ఈ నెల 26 నుంచి 29 వరకు 3 రోజులు పాటు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ ఎన్ మనోహర్ పేర్కొన్నారు. మంథని మున్సిపల్ కార్యాలయంలో ఆయా బ్యాంకుల వారిగా 26 న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎడిబి, 28 న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్, 29 న యూనియన్ బ్యాంక్, టిజిబి, కెనరా, కెడిసిసి, ఐసిఐసిఐతో పాటు ఇతర బ్యాంకు శాఖలు అధికారులు హాజరు కానున్నారని రాజీవ్ యువ వికాసం పథకానికి ధరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.



# తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణి

గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : రామగుండం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం నాయకులు నిమ్మకాయల ఏడుకొండలు సభ్యత్వ నమోదు కార్డులు పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సభ్యత్వం 1200కాగా నియోజకవర్గంలోని అన్ని డివిజన్ లకు మరియు గ్రామాలకు కార్డులు పంపిణి చేసాము ఇంకా ఎవరు ఐతే తీసుకొని వారు ఉన్నారో వారు గోదావరిఖని పార్టీ కార్యాలయంలో సంప్రదించంగలరని మనవి చేసారు ఇట్టి సభ్యత్వనికి కృషి చేసిన నాయకులకు కార్యకర్తలకు మరియు ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు . ఈ కార్యక్రమంలో ముదిగంటి దామోదర్ రెడ్డి, గుండబోయిన ఓదెలు రొడ్డ బాణమ్మ, నా రెడ్డి స్వరాజ్యం, సల్ల రవీందర్, పెగడపల్లి రాజనర్సు, బేక్కం వీరేందర్,కోండి శ్రీనివాస్,సుందిల్లా స్వామి,కోండి సారిక,నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దేశ స్వాతంత్ర్యంలో ముఖ్య పాత్ర పోషించింది కాంగ్రెస్ పార్టీయే

## - మంథని సింగిల్ విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్



మంథని రూరల్ (ఆకాంక్ష న్యూస్) : దేశానికి స్వాతంత్ర్యం కోసం ప్రముఖ పాత్ర పోపించింది కాంగ్రెస్ పార్టీయే అని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ ముగింపు కార్యక్రమాన్ని మంథని మండలం నాగేపల్లి, అడవిసోమన్ పల్లి గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వం స్వాతంత్ర్యం కోసం కొట్లాడింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని, వారి ఆశయాలను సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతం పేరుతో రాజకీయం చేస్తుందని అన్నారు. అదేవిధంగా నరేంద్ర మోడి ఎన్నికలకు ముందు సామాన్యుల జన్ ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు జమచేస్తామని వాగ్దానం చేసి జమ చేయలేదని అన్నారు. గ్యాస్ సిలిండర్ కు రూ.500 నుంచి రూ.1200కు పెంచిందని అన్నారు. దేశానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ శ్రీరామ రక్ష అని అన్నారు. అంతేగాకుండా ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ వారి అడుగు జాడల్లో నడుస్తున్నామని అన్నారు. మంథని నియోజకవర్గం అభివృద్ధి మంత్రి శ్రీధర్ బాబుతోనే సాధ్యమవుతుందని రానున్న రోజుల్లో మంథని అభివృద్ధితో రూపురేఖలే మారుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రావికంటి సతీష్ కుమార్, మంథని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ పెండ్లి రమా-సురేష్ రెడ్డి, నాయకులు కుడుదుల వెంకన్న, పేరవేన లింగయ్య, మంథని సత్యనారాయణ, వొడ్నాల శ్రీనివాస్, సాదుల శ్రీకాంత్, ఎరుకల ప్రవీణ్, బాపు, మహేందర్, బండం మధు, సమ్మిరెడ్డి, ఆకాష్, బెజ్జెంకి మల్లయ్య, అక్కపాక సదయ్య, మాజీ సర్పంచులు, ఎంపిటీసీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# 93% విద్యార్థినులు ఉత్తీర్ణత...

## - మంథని బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్మా జబీన్










మంథని రూరల్ (ఆకాంక్ష న్యూస్) : తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మంథని లో ఉన్న బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 93% విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారని మంథని బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ( టి.జి.ఎం.ఆర్.జే.సి) అస్మా జబీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.మొదటి సంవత్సరం ఎంపీసీ కోర్సులో 100 శాతం, బైపిసి కోర్సులో 95.4 శాతం, రెండవ సంవత్సరం ఎంపీసీ కోర్సులో 80 శాతం,హా బైపిసి కోర్సులో 93.3% విద్యార్థినిలు ఉత్తీర్ణత సాధించారని అన్నారు. రెండవ సంవత్సరం ఫలితాలలో విద్యార్థినులకు 1000 మార్కులకు గాను బైపిసి కోర్సులో ఎన్.హర్షిత కు 991, ఎం.లిపిక 989, మనుష 986, హర్షిని 918, సౌమ్య 957, మహీన్ 978, కే.గ్రేస్ 976 మార్కులు, ఎంపిసి లో సిహెచ్. సాహిత్య 947, సౌజన్య 926, వైశాని 920 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో విద్యార్థినులకు ఎంపీసీ కోర్సులో 470 మార్కులకు గాను నిధా కు 464, సాయి వర్షిని 460, అక్షర 458, స్ఫూర్తి , అశ్విత, శ్రీజ లకు 437, ఆఫ్రిన్ 424, శ్రీనిధి 422, సాయి ప్రసన్న 414 మార్కులు, బైపిసి కోర్సు లోహా 440 మార్కులకు గాను గీతాంజలి 423,హా రిమిషా 421, స్పందన 419 , అబేద 414, జావరియా 407 మార్కులు సాధించడం జరిగిందని అన్నారు. ఇంటర్ పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు సాధించిన విద్యార్థులు అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక్క ప్రకటనలో పేర్కొన్నారు.

# మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి

## - జగ్గంపేట (జర్నలిస్ట్ లీడర్ ) వీ.ఐ లెనిన్ జయంతి సందర్భంగా జరిగిన శాంతి ర్యాలీ లో ఏపీ ఆర్ సి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ డిమాండ్




మార్క్సిస్ట్ మహూ పాధ్యాయుడు, ప్రపంచంలో తొలి సోషలిస్ట్ విప్లవాన్ని విజయవంతం చేసిన వి ఐ లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకుని, ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నియోజకవర్గ కేంద్రం జగ్గంపేట, ఎం.పీ డీ.వో కార్యాలయం వద్ద ఏ.పీ .ఆర్. సి .ఎస్, ఏ.ఐ.ఎఫ్ .టి.యు, పి.డి.ఎస్.యు ( వి), తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వి ఐ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ట్రావెల్స్ బంగ్లా వద్దనుండి పోలీస్ స్టేషన్, బస్టాండ్ మీదగా పంచాయతీ కార్యాలయం వరకు తిరిగి ఎంపీడీవో కార్యాలయం వరకు వి ఐ లెనిన్ చిత్రపటం మరియు డిమాండ్లతో కూడిన ప్లకార్డులతో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలి!, సామ్రాజ్యవాదం నశించాలి!, అడవులను రక్షించుకోవాలి?, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి!! అంటూ నినదించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ ఆర్ సి ఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్ మాట్లాడుతూ. ఆపరేషన్ కగార్ పేరుతో మధ్యభారత అడవుల్లో ఆదివాసులపై సాగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ప్రపంచంలో సామ్రాజ్యం వాదాన్ని వ్యతిరేకించి కార్మిక వర్గ దృక్పథంతో పోరాడి సోషలిస్ట్ విప్లవాన్ని విజయవంతం చేసి, శ్రమజీవుల పాలిట భూలోక స్వర్గాన్ని సృష్టించారని కొనియాడారు. లెనిన్ జయంతి రోజే భారత విప్లవ పార్టీ సిపిఐ (ఎం.ఎల్ ) ఆవిర్భావించిందని గుర్తు చేశారు.సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం అని వి.ఐ లెనిన్ విశ్లేషించారన్నారు. ప్రపంచంలో ,దేశంలో సామ్రాజ్యవాద అధర్మ యుద్ధాలు కొనసాగుతున్నాయని, దేశంలో అడవి, అటవీ గర్భ ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే మధ్యభారత అడవుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులపై దాడులు చేస్తూ మారణ హోమాన్ని సృష్టిస్తున్నారన్నారని విమర్శించారు. తక్షణమే ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని, ఆదివాసి ప్రాంతాల్లో పెసా మరియు 1/70 చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆర్ సి ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు మాట్లాడుతూ మహూపాధ్యాయుడు వి ఐ లెనిన్ తొలి సోషలిస్ట్ విప్లవ విజయవంతనికి చేసిన కృషిని వివరించారు. ప్రపంచంలో జరుగుతున్న సామ్రాజ్యవాద అధర్మ యుద్ధాలను ఖండించాలని, ప్రజలకు పిలుపునిచ్చారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మానవహణనాన్ని తక్షణమే ఆపాలన్నారు. దేశంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గత 11 ఏళ్లుగా ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ, ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. అధిక ధరలు, నిరుద్యోగం, మతోన్మాదం వంటి అసమానతలు తీవ్రంగా పెరిగిపోయాయి అన్నారు. మహూపాధ్యాయుడు వి.ఐ .లెనిన్ స్ఫూర్తితో దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామ్య విప్లవం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు (వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, ఏఐఎఫ్ టి యు నాయకులు కే జోజి, ఏపీ ఆర్ సి ఎస్ జిల్లా నాయకులు మడికి సత్యం, నాయకత్వం వహించారు.



# కొందరు రేవంత్ సైన్యంలా పనిచేస్తున్నారు

- మూడేళ్లలో మళ్లీ అధికారంలోకి వస్తాం
- అప్పుడు తప్పు చేసిన వారిని వదిలిపెట్టం
- లగచర్ల బాధితులకు న్యాయం చేయాలి
- లేదంటే మరోమారు సుప్రీంను ఆశ్రయిస్తాం
- మీడియా సమావేశంలో కేటీఆర్ హెచ్చరిక

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, ఏప్రిల్ 22 : కొందరు పోలీసులు రేవంత్ టీమ్‌లాగా పనిచేస్తున్నారని మాజీమంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ వ్యవహార శైలిని, పోలీసుల తీరును ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా తప్పుబట్టింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నివేదిక తర్వాతైనా రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి. బాధ్యులైన పోలీసులను సర్వీసు నుంచి తొలగించాలి. లేదంటే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం. హైకోర్టు స్టే ఇచ్చినా భూసేకరణ చేస్తున్నారని తెలిసింది. దానిని వెంటనే నిలిపివేయాలి. మూడేళ్లలో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. అతి చేసే అధికారులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని కేటీఆర్ అన్నారు. లగచర్ల ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. గిరిజనుల పట్ల జరిగిన అన్యాయాన్ని, పోలీసుల ప్రవర్తనను, రాష్ట్ర ప్రభుత్వ తీరును ఆయన తీవ్రంగా విమర్శించారు. లగచర్ల గ్రామస్తుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాడుతుందంటూ ధంకా మోగించారు. బీఆర్ఎస్ బహిరంగ సభ కోసం లగచర్ల గిరిజన ఆడబిడ్డలు స్వచ్ఛందంగా లక్ష రూపాయలు విరాళంగా అందించారు. ఇది రాజకీయ సభలకు సాధారణంగా లభించే విరాళం కాదు, వారి ఆత్మబలమైన సంకేతం. బీఆర్ఎస్ లాంటి పార్టీ మాకు అండగా ఉంది కాబట్టే మేము ఈ సహాయం చేస్తున్నాం అని ఆడబిడ్డలు పేర్కొనడం విశేషం. ప్రభుత్వం 40 మంది లగచర్ల రైతులను అరెస్టు చేసి జైళ్లలో చిత్రహింసలకు గురిచేసిందని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యంగా హీర్యా నాయక్ అనే రైతుకు గుండెనొప్పి వచ్చినప్పుడు కూడా పోలీసులు కట్టేసిన సంకెళ్లతోనే ఆసుపత్రికి తరలించారని, ఇది మానవత్వానికి వ్యతిరేకమని మండిపడ్డారు. లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ-ఎస్టీ కమిషన్‌లు స్పందించాయని, పోలీసులు అప్రజాస్వామికంగా ప్రవర్తించారని రిపోర్ట్‌లో పేర్కొన్నట్లు కేటీఆర్ వెల్లడించారు. పోలీసులు ప్రయివేటు- సైన్యంలా, మానవ మృగాల్లా ప్రవర్తించారన్న ఆరోపణలు నిజమయ్యాయని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చెట్ల నరకడం, లగచర్ల రైతులపై దాడి వంటి అంశాలపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ-, జాతీయ మానవ హక్కుల సంఘం తీవ్ర విమర్శలు చేసినట్లు- కేటీఆర్ పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి నైతిక పరాభవంగా నిలిచిందన్నారు. రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యేగా, హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండడానికి అర్హత కోల్పోయారు. వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. కొడంగల్ ప్రాంతంలోని ఆడబిడ్డలకు జరిగిన అవమానం వల్ల రేవంత్ రెడ్డి వారికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ స్పష్టం చేశారు. లగచర్ల రైతులపై దాడి చేసిన పోలీసులను సర్వీసు నుండి తొలగించాలని డిమాండ్ చేసిన కేటీఆర్, చర్యలు తీసుకోకపోతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేసిన తప్పులకు పదవీ విరమణ తర్వాత కూడా వదిలిపెట్టమని అధికారులకు హెచ్చరికలు చేశారు. ప్రభుత్వం లగచర్లలో భూసేకరణ చర్యలను తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ప్రజల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించింది. ఏప్రిల్ 27న నిర్వహించనున్న భారాస రజతోత్సవానికి వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన మహిళలు విరాళం ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆ మొత్తాన్ని అందజేశారు.

# కాశ్మీర్‌లో పెట్రేగిన ముష్కరులు

- కాల్పుల్లో 27 మంది పర్యాటకలు మృతి
- మరో 20 మంది పరిస్థితి విషమం

(ఆకాంక్ష న్యూస్)

శ్రీనగర్, ఏప్రిల్ 22 : జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. హిందూ పర్యాటకులు లక్ష్యంగా జరిపిన కాల్పుల్లో 27మంది బలయ్యారు. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చిన వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 27 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్‌లో అతిపెద్ద ఉగ్ర ఘటన ఇదేనని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్యటకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమైంది. బైసరన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ప్రస్తుతం 27కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా.. 14కి.మీ మార్గం గండేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఈ ఘటనపై ప్రధాని మోడీ హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడారు. అమిత్ షా ఉన్నతస్థాయి విచారణచేపట్టారు. అనంతరం ఆయన ఘటనా స్థలికి బయలు దేరారు.

# తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

(ఆకాంక్ష న్యూస్)




హైదరాబాద్, ఏప్రిల్ 22 : కరీంనగర్ జిల్లా కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. గతేడాది నవంబర్ 1న ఎన్నికల ప్రచారసభ నిర్వహించిన కౌశిక్‌రెడ్డి.. ఓటర్లు తనకు ఓటు వేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని వ్యాఖ్యానించారు. దీనిపై ఎన్నికల నోడల్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కమలాపురం పోలీసులు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు నిర్వహించి అభియోగపత్రం దాఖలు చేశారు. రాజకీయ కక్షల కారణంగానే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేశారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఆత్మహత్య పేరుతో ఎన్నికల ప్రచారసభలో ఓటర్లను బెదిరించారని ప్రభుత్వ తరఫు న్యాయవాది అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకే నోడల్ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సాక్షులుగా ఓటర్ల వాంగ్మూలాన్ని ఎందుకు నమోదు చేయలేదని ప్రభుత్వ న్యాయవాదిని కోర్టు ప్రశ్నించింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

# కేసులపై బాబు విచారణ చేయించుకోవాలి

- వైజాగ్ భూ పందేరాలపై విచారణ జరగాలి
- అమరావతి దోపిడీపై ప్రధాని నిలదీయాలి
- మాజీమంత్రిఆర్‌కె రోజా డిమాండ్

అమరావతి,ఏప్రిల్22: పారదర్శకత,నీతి గురించి మాట్లాడుతున్న చంద్రబాబు తన కేసులపై విచారణ ముందు చేయించుకోవాలని, కుంటి సాకులతో కేసుల నుంచి బయటకు వచ్చారంటూ వైసీపీ నేత ఆర్కే రోజా విమర్శించారు. నాలుగో సారి సీఎంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చంద్రబాబు ఇల్లు కట్టుకోలేదు అని మాజీమంత్రి ఆర్కే రోజా అన్నారు. ఇప్పుడు ఏదో మొదలు పెట్టారు.. మాట్లాడితే జగన్ బెంగుళూరు వెళ్తున్నారు అంటున్నారు.. గతంలో మీరు ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించింది. శుక్రవారం అయితే హైదరాబాద్ కి వెళ్లి పోతున్నారు.. మీరు హైదరాబాద్ లో ఉండటం వల్లే వరదలకు విజయవాడ మునిగి పోయింది.. అధికారంలో ఉన్న మీరు హైదరాబాద్ లో తిరుగుతున్నారని జనాలు నవ్వుకుంటున్నారు.. ఇక, అమరావతిని దోచుకోవాలని అనుకున్న చంద్రబాబుపై ప్రధాని మోడీ విచారణ చేయించాలని ఆర్కే రోజా డిమాండ్ చేసారు. ప్రధాని తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలన్నారు. అయితే, వైజాగ్ ను రాజధాని చేయాలని జగన్ కలలు కన్నారు.. పరిపాలన రాజధాని చేస్తే వైసీపీ వల్ల అరాచకాలు చేస్తారని భయ పెట్టారు.. వైజాగ్ లో 60 రోజుల ముందు పుట్టిన ఉర్సా కంపెనీకి మూడు వేల కోట్ల భూములు దారాదత్తం చేశారు.. దావోస్ లో వీళ్లకు ఒక్క ఎంఓయూ కూడా కాలేదు.. హైదరాబాద్ లో వీళ్ళు ఇచ్చిన కంపెనీకి బోర్డులు, అడ్రస్‌లు కూడా లేవు.. టీడీపీకి చెందిన ఓ ఎంపీ స్నేహితుడి కంపెనీకి ఎకరాలకు ఎకరాల భూములు కట్టబెడుతున్నారంటూ ఆరోపణలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల ఇబ్బందులపై వైసీపీ అండగా నిలబడుతుంది అని మాజీ మంత్రి రోజా తెలిపింది. అలాగే, హిందువులు పూజించే గోమాతలు మృతి చెందుతున్నప్పటికీ చంద్రబాబు ఒప్పుకోవటం లేదు అని వైసీపీ నేత రోజా అన్నారు. ఇప్పటికే రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు.. ఈ ఏడాదిలో తిరుమలలో ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ప్రజలు గమనించాలి.. చెప్పులు వేసుకుని గుళ్ళకు వస్తున్నారు.. తిరుమలలో ఏం జరుగుతుందో కూడా చూడాలని సూచించింది. శ్రీకూర్మంలో అన్నీ తాబేళ్లు చనిపోతున్నా పట్టించుకోవటం లేదు.. ప్రజలకు మంచి చేయటానికి వీళ్లకు -టైం లేదు.. ఇక, సనాతన ధర్మాన్ని కాపాడుతానన్న పవన్ ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించింది. బీజేపీ వాళ్ళు ఇన్ని అపచారాలు జరుగుతుంటే ఎందుకు సరిదిద్దటం లేదు.. కూటమిలో ఉంటే ప్రభుత్వం చేస్తున్న తప్పులను కూడా సమర్థిస్తారా అని ఆర్కే రోజా అడిగింది. కాగా, మద్యం ప్రభుత్వం అమ్మితే స్కామా.. ప్రైవేట్ వాళ్ళు అమ్మితే స్కామా అని మాజీ మంత్రి రోజా ప్రశ్నించింది. ఎంపీ మిథున్ రెడ్డి పార్లమెంట్ లో వీళ్ళ కుట్రలపై మాట్లాడుతున్నారు కాబట్టే కేసులు పెట్టారని పేర్కొనింది. ఆయనపై ఏ ప్రాతిపదికన విచారణ చేస్తున్నారో అర్థం కావటం లేదు.. జగన్ స్కీములు మాత్రమే చేశారు.. జగన్ బటన్లు నొక్కితే అవినీతి జరిగే అవకాశం లేదని చెప్పుకొచ్చింది.

# ఢిల్లీ పర్యటనలో బిజీగా సిఎం చంద్రబాబు

- కేంద్రమంత్రి అమిత్ షాతో రాజ్యసభపై చర్చ?
- కేంద్రమంత్రి పాటిల్‌తో బనకచర్లపై ప్రతిపాదనలు

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ,ఏప్రిల్22 : ఢిల్లీ పర్యటనలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు బిజీబిజీగా గడిపారు. పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించిన సీఎం చంద్రబాబు.. కేంద్ర హోంశాఖ మంత్రితో కీలక చర్చలు జరిపారు.. ప్రధానంగా రాజ్యసభ ఉప ఎన్నికలపై చర్చించినట్టుగా తెలుస్తోంది.. ఏపీ నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని భర్తీ చేసే అంశంపై నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం.. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్టుగా చెబుతున్నారు.. నామినేషన్ దాఖలుకు ఈ నెల 29వ తేదీ తుది గడువు ముగియనుంది. ఇప్పటి వరకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మొత్తం నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేశారు.. మోపిదేవి వేంకట రమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య, విజయసాయి రెడ్డి.. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామాలు చేయగా, ఇప్పటికి మూడు స్థానాలు భర్తీ చేశారు.. ఇక, మిగిలిపోయిన నాల్గో స్థానం భర్తీపై బీజేపీ, టీడీపీ మధ్య చర్చలు జరిగాయని తెలుస్తోంది.. ఖాళీ అయిన స్థానాలకు ఇద్దరు టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా సానా సతీష్, బీద మస్తాన్ రావు ఎన్నిక కాగా, మూడవ స్థానాన్ని బీజేపీ.. ఆర్ కృష్ణయ్యతో భర్తీ చేసింది.. నాలుగవ స్థానాన్ని భర్తీ చేసే అంశంపై ఈ రోజు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాతో టీ-డీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు కీలక సమాలోచనలు చేశారు.. దీనిపై ఈరోజో..రేపో.. అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందంటున్నారు..ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్‌తో భేటీ- అయ్యారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా ఎంపీలు పాల్గొన్నారు. మే 2న ప్రధాని మోదీ అమరావతి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై అమిత్‌షాతో చంద్రబాబు చర్చించారు.


# పారదర్శకంగా రేషన్ విధానం: నాదెండ్ల

ఏలూరు,ఏప్రిల్22 : ఏలూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పారదర్శకమైన రేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాం అని తేల్చి చెప్పారు. కానీ, గత వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో రేషన్ మాఫియా విచ్చలవిడిగా కొనసాగింది అని ఆరోపించారు. ఇప్పుడు, రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితిని చక్కబెడుతున్నాం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంత అరాచకం జరిగిందో ప్రజలకు బాగా తెలుసు అని పేర్కొన్నారు.

కాగా, పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుంది.. నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం అని మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు.

# అందరికీ అందుబాటులో అర్బన్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నందు అల్ట్రా సౌండ్ స్కానింగ్

- గర్భిణీ స్త్రీలను స్కానింగ్ లకు సిబ్బంది పంపించాలి
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దుర్గారావు దొర
- జిల్లా ఎఫ్ డి పి నోడల్ అధికారి డాక్టర్ సుమలత



రామచంద్రపురం , (ఆకాంక్ష న్యూస్) :అందరికీ అందుబాటులో ఉండే విధంగా స్థానిక అర్బన్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నందు అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహిస్తున్నామని, గర్భిణీ స్త్రీలను స్కానింగ్ లకు సిబ్బంది పంపించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎమ్ దుర్గారావు దొర , జిల్లా ఎఫ్ డి పి నోడల్ అధికారి డాక్టర్ సుమలత పేర్కొన్నారు . స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మంగళవారం మండపేట, రామచంద్రపురం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లు 4 కి సంబంధించిన మెడికల్ ఆఫీసర్ లకు, సూపర్వైజర్ లకు, ఏఎన్ఎం లకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి వారు హాజరయ్యారు .ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం దుర్గారావు దొర , జిల్లా ఎఫ్ డి పి నోడల్ అధికారి డాక్టర్ సుమలత మాట్లాడుతూ రామచంద్రపురం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహిస్తున్నామని గర్భిణీ స్త్రీలను స్కానింగ్ లకు సిబ్బంది పంపించాలని సూచించారు. అంగన్వాడి, స్కూల్ పిల్లలను నూటికి నూరు శాతం స్క్రీనింగ్ చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి హైపర్ టెన్షన్ ,డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి ,ఆన్లైన్ సర్వేలో నమోదు చేయాలని తెలిపారు. ఆయుష్మాన్ కార్డులు ఈ కె వై సి చేయాలన్నారు . 0 నుండి 5 సంవత్సరములు గల పిల్లలకు నూరు శాతం వ్యాక్సిన్ అందించాలని తెలిపారు. వేసవికాలంలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ ప్రశాంతి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్ , డివిజనల్ సూపర్వైజర్ జి కమల్ శేషు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హేమ సుధీర్, డాక్టర్ వీరభద్ర రెడ్డి, డాక్టర్ భవాని, డాక్టర్ రమ్య , సూపర్వైజర్లు , ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

# జిల్లాలో తొలివిడత పియంఎవై పథకం క్రింద పేదల కొరకు నిర్మించిన కాలనీలు, టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక సదుపాయాల కల్పన, బిల్లుల చెల్లింపుకు చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**




కాకినాడ (ఆకాంక్ష న్యూస్) కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ పేదల గృహనిర్మాణ కార్యక్రమ ప్రగతిపై హౌసింగ్, సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలివిడత పియంఏవై పథకం క్రింద చేపట్టిన అన్ని కాలనీలు, టిడ్కో గృహసముదాయాలకు విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని ఆయా శాఖల అధికారులును ఆదేశించారు. ఆయా అంశాల క్రింద నిర్వహించిన పనులుకు చెల్లించాల్సిన బిల్లు మెత్తాలు, పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల వివరాలతో శాఖల వారిగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా అన్ని కాలనీలలో పైపులను విస్తరించి, పూర్తయిన గృహాలన్నిటికీ టాప్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్బన్ కాలనీలలో అమృత్-2.0 పథకం క్రింద త్రాగునీటి సరఫరా పనులు చేపట్టాలన్నారు. పూర్తయిన కాలనీలలో సంబంధిత గ్రామపంచాయితీలు పారిశుద్య నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఆలాగే అన్ని కాలనీలలో పచ్చదనం పెంపొందించేందుకు డ్వామా ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అన్ని కాలనీలలో అంతర్గత విద్యుత్ లైన్ల ఏర్పాటు పూర్తి చేసి ధరఖాస్తు చేసిన లబ్దిదారులకు గృహావసర కనెక్షన్లు కల్పించాలన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా జరిపిన లాండ్ అక్విజిషన్ , డ్వామా, హౌసింగ్ శాఖల ద్వారా చేసిన లాండ్ లెవెలింగ్ పనులకు చెల్లించాల్సిన మొత్తాల జారీ కొరకు ప్రభుత్వాన్ని కోరేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్దం చేయాలని హౌసింగ్ పిడిని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి ఎన్.వి.వి.సత్యన్నారాయణ, డ్వామాపిడి పి.వెంకటలక్ష్మి, ట్రాన్స్కో ఎస్ఈ డి.ప్రసాద్, మెప్మాపిడి పియంవద, ఎల్డిఎం జెఎస్విఎస్ ప్రసాద్, డిఆర్డిఏ , ఆర్డబ్ల్యుఎస్, టిడ్కో, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

# పోలవరంలో రాళ్లు, కాంక్రీట్ నాణ్యత పరీక్షించిన కేంద్ర బృందం

పోలవరం, (ఆకాంక్ష న్యూస్)ఏప్రిల్ 22 : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించే కాంక్రీట్, రాళ్ళ నాణ్యత ను కేంద్ర బృందాలు పరిశీలిస్తున్నాయి. సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సి ఎస్ ఆర్ ఎం ఎస్ )కు చెందిన రెండు బృందాలు ఈ నాణ్యత పరీక్షల్లో పాల్గొంటున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ లో వినియోగించే కాంక్రీట్, ఆ కాంక్రీట్ మిక్స్ చేసేందుకు వినియోగించే వివిధ సైజుల రాళ్లను ఈ బృందాలు మంగళవారం తనిఖీ చేశాయి. బట్రస్ డ్యామ్, డి వాల్ నిర్మాణ ప్రాంతం, 902 హిల్ ప్రాంతం మొదలైన వాటిని వీరు పరిశీలించారు.ప్రాజెక్ట్ నిర్మాణం లో వినియోగించే కాంక్రీట్, అందులో కలిపే వివిధ రకాల మెటీరియల్స్ ను నిపుణులు రవి అగర్వాల్, లలిత్ కుమార్ సోలంకి, రాళ్ళను సందీప్ దనోటే పరిశీలించారు. కేంద్ర బృందం వెంట జలవనరుల శాఖ అధికారులుడీ శ్రీనివాస్, ఎం. శ్రీరాం పటేల్, ఆర్ దుర్గాప్రసాద్, ఆర్ వీ చిరంజీవి, వీ జగదీష్, జి సురేంద్ర, జాన్ కరణ్ ఉన్నారు, ఎంఈఐఎల్‌జి ఎం గంగాధర్,డి జీ ఎం మురళి పమ్మివీరి తనిఖీలకు అవసరమైనఏర్పాట్లు చేశారు.

# కలుషితమై నీటితో ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవద్దు

**- పట్టణ బిజెపి అధ్యక్షులు డాక్టర్ మాచర్ల రామకృష్ణ**






(ఆకాంక్ష న్యూస్)ఏప్రిల్ 22 (గుడివాడ): పట్టణ స్థానిక పెద్ద కాలవ మరియు నేలపూడి డ్రైన్ కాలువలో చెత్త,చెదారం, వ్యర్థపదార్థాలు పేరుకుపోయి తూములకు అడ్డంగా నిలిచిపోయి, కాలువలో ఉన్న నీరు దిగు ప్రాంతాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుందని, గుడివాడ పట్టణ దిగువ ఉన్న గ్రామాలు ఆ నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నారని దయచేసి మానవత హృదయంతో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు యుద్ధ ప్రాతిపాతికంగా చెత్తాచెదారం మరియు పూడికలు తీయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మరియు మన స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ప్రజల దాహార్తి కోసం ఏ విధంగా అందించాలో, ఆలోచిస్తుంటే, గుడివాడ పట్టణ ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం చాలా బాధాకరమని, ఏదేమైనా కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వము అని, ప్రజలకు ఏవిధంగా ఇబ్బంది వచ్చిన ఎన్డిఎ కూటమి ప్రభుత్వం ఆ సమస్యను తొలగించి ప్రజలకు ఏ ఇబ్బందులు లేకుండా చేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, గాదె చరణ్, బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాబోవు నైరుతి రుతుపవనాల సమయంలో విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కోవాలి

**-జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



(ఆకాంక్ష న్యూస్)మచిలీపట్నం, ఏప్రిల్ 22: రాబోవు నైరుతి రుతుపవనాల సమయంలో విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి జాగ్రత్తగా ముందస్తు ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి ఆర్డీవోలు జిల్లా అధికారులతో రానున్న నైరుతి రుతుపవనాల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ఏర్పాట్లపై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలన్నారు. తుఫానులు, అసాధారణ భారీవర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఏ గ్రామాలు ప్రభావితం అయ్యాయో గుర్తించాలని అక్కడ స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్( ఎస్ఓపి) ప్రకారం ముందస్తు జాగ్రత్తలు అన్నింటిని చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి వారిని అక్కడి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుందన్నారు. సహాయక శిబిరాలు ఏర్పాటు చేసే భవనాలను పరిశీలించి మరమ్మతులు, ఇతర పునరుద్ధరణ పనులు చేపట్టి పటిష్ట పరచాలని, ఇందుకోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తుఫాను షెల్టర్లను కాకుండా ఇతర ఏ భవనాలను సహాయక శిబిరాలుగా వినియోగించుకోవచ్చో గుర్తించాలన్నారు. పారిశుధ్యము, మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితర అత్యవసర సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాలు వరదల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నీటిమట్టం ఎప్పటికప్పుడు గమనించుకుంటూ నిరంతరం పనిచేశారని అదే తరహాలో అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఎక్కడైనా భవనాలు శిథిలావస్థలో ఉంటే వాటిని తొలగించాలన్నారు మంచినీటి పైప్లైన్ల లీకేజీలు ఎక్కడైనా ఉంటే ముందుగా సరి చేయాలన్నారు. ఎక్కడైనా చెరువులు వరదలకు గండిపడితే వాటిని మూసివేసేందుకు ఇసుక మూటలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతిన్న వాటిని సత్వరమే పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.అలాగే ఎక్కడైనా రహదారుల్లో చెట్లు పడిపోయి గాని లేదా ఏమైనా ఇతర అడ్డంకులు ఎదురైతే రాకపోకలకు ఇబ్బంది లేకుండా వాటిని తొలగించేందుకు విద్యుత్ రంపాలు ఇతర పరికరాలు అందుబాటులో ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభావిత ప్రాంత ప్రజలను తరలించేందుకు అవసరమైన చోట్ల వాహనాలను సమకూర్చాల్సి ఉంటుందన్నారు పెట్రోల్ బంకులలో కావలసినంత పెట్రోల్, డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు ఎంఎల్ఎస్ పాయింట్లో రైతులకు ఉపయోగపడే విధంగా టార్పాలిన్ పట్టాలు చివరి నిమిషంలో కాకుండా ముందస్తుగా తెచ్చి పెట్టుకోవాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కావలసినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పంటలు దెబ్బతింటే నష్టం వాటిల్లకుండా రైతులు పండించే పంటలకు బీమా చేయించుకునేలా అవగాహన కలిగించాలన్నారు. అలాగే పశువులకు కూడా బీమా చేయించేలాగా రైతులను ప్రోత్సహించాలన్నారు. రొయ్యలు, చేపల చెరువులు దెబ్బతినకుండ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ గూగుల్ మీట్ లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, మచిలీపట్నం, గుడివాడ ఉయ్యూరు ఆర్డీవోలు స్వాతి, బాలసుబ్రమణ్యం, హేలా షారోన్ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ శాఖ క్రీడా పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు






(ఆకాంక్ష న్యూస్)ఏప్రిల్ 22,(గుడివాడ):జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం - 2025 ను పురస్కరించుకొని కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల క్రీడా పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జె. అరుణ ఆధ్వర్యంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం నందు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రికెట్, చెస్, క్యారమ్స్, కబడ్డీ, బాడ్మింటన్, మ్యూజికల్ చైర్స్ లతో పాటు ఇతర పోటీలు నిర్వహిస్తున్నారు.జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులందరూ క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొని వారి క్రీడా స్ఫూర్తిని చాటారు.



# ఆరోగ్యం



## నలభై దాటాక నిత్య యవ్వనం ఉండాలంటే ఈ పద్ధతులు పాటించండి!

నాలుగు పదుల వయస్సు వచ్చేసరికి వయస్సు అయిపోతుంది అనే భావనలో మీలో వస్తుంది. ఆ భావనతోనే మీపట్ల మీరు అశ్రద్ధ చూపిస్తుంటారు. కానీ అసలైన యవ్వనం నలభైలోనే మొదలౌతుంది. ఆహార విషయంలో నియమాలను ఈ వయస్సు నుండే పాటించాలి. అతిగా కాకుండా మితంగా పౌష్టికాహారం తినాలి. అది కూడా సమయానికి తినాలి. నలభై దాటాక ఇవి చెయ్యాల్సిందే ఈ వయస్సులో శరీరానికి వ్యాయామం చాలా అవసరం. నాలుగు పదుల వయస్సు అనేది కాలానికి సంఖ్య మాత్రమే అది మీ శరీరానికి కాదు అనే భావన మీలో ఉండాలి. అప్పుడే మీరు మీలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకుంటారు. ప్రతి కుటుంబంలో ఈ వయస్సులోనే ఆర్థిక ఇబ్బందులు, పిల్లల జీవితాలు చక్కబెట్టాలి అనే ఆలోచనలు ఇలా అనేకమైన ఆలోచనలు ప్రతి ఒక్కరిలో నలభైఏళ్ళు దాటిన నుండే మొదలౌతాయి.

మీ బాడీ ఫిట్ గా ఉండాలంటే ఇలా చెయ్యండి మీరు చేసే పని మీద ద్యాస వున్న మీ మెదడు అనేకమైన ఆలోచనలతో సతమతం అవుతూ ఉంటుంది. వీటన్నింటినీటిని వదిలి మీ మనస్సును మీ అధీనంలోకి తెచ్చుకోవడానికి,మీరు ఉత్సాహంగా ఉండడానికి మీకు రోజు మినిమం ఒక గంట కచ్చితంగా వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. ఇలా క్రమం తప్పకుండా రోజు వ్యాయామం చేయడం వలన మీరు ఆరోగ్యంగా ఉంటారు. మీ బాడీ కూడా ఫిట్ గా కూడా ఉంటుంది. అప్పుడే మీరు యవ్వనంగా కనిపిస్తారు. యవ్వనంగా కనిపించడానికి అన్నింటికంటే ఇది ముఖ్యం అనేక మందిలో ప్రతి రోజు వెంటాడుతున్న అతి భయంకరమైన సమస్య నిద్ర లేమి. ఈ సమస్య ఉన్నవారు అనేక రోగాలతో ఇబ్బంది పడతారు. తెలిసి తెలిసి ఇలాంటి సమస్యలను మనమే కొనితెచ్చుకుంటున్నాం. నిద్రలేమి సమస్య ఉన్నవారు అసలే యవ్వనంగా ఉండలేరు. తొందరగా వయస్సు మీద పడిన వారి లాగ కనిపిస్తుంటారు..

ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి ఆరోగ్య వంతమైన జీవితానికి ప్రతి మనిషికి నిద్ర ఒక వరం లాంటిది. కంటి నిండా నిద్ర పోయేవారికి అంటే కనీసం ఏడు గంటల నుండి ఎనిమిది గంటలు పడుకునేవారికి ఒంట్లో ఏ ఆరోగ్య సమస్యలు ఉన్నా మాయమైపోతాయి. నిద్ర బాగా పోయేవారు అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు. యవ్వనంగా కూడా ఉంటారు. కనుక నిద్ర విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి. ప్రేమలో పడిన వారు జీవితకాలం యవ్వనంగా ఉంటారు ప్రేమ అని చెప్పడానికి రెండు అక్షరాలే కానీ ఈప్రేమలోనే జీవితం ఉంటుంది. కష్టం సుఖం ఈ రెండు అక్షరాలలోనే ఉంటుంది. అదే ప్రేమలో తల్లి దండ్రులను ప్రేమించండి,మీ పిల్లలను ప్రేమించండి ,మీ జీవిత భాగస్వామినీ ప్రేమించండి. సాటి మనుషులను ప్రేమించండి. ఆ ప్రేమలోనే సంతోషాన్ని వెతుక్కొండి. ఆ సంతోషమే మీ ఆరోగ్యానికి మంచి మెడిసిన్ లాగ పనిచేస్తుంది. ప్రేమతో యవ్వనం అనేక పరిశోధనలో తేలిన విషయం చాలా మంది నిపుణులు చెప్పిన మాటల ప్రకారం ప్రేమగా అన్యోన్యంగా ఉన్న దంపతులు ఎక్కువ కాలం జీవించారు అని, వారు ఎల్లపుడు యవ్వనంగా కనిపించేవారని చెప్తారు. అందుకే కోపాలు, చిరాకులు పక్కన బెట్టి ప్రేమమయ జీవనాన్ని గడిపితే యవ్వనంగా, ఉత్సాహంగా ఉంటారు. ప్రతి మనిషిలో కాస్త కళ పోషణ ఉండాలి మనుషుల్లో బొత్తిగా కళా పోషణ తగ్గిపోతుంది. ఒకప్పుడు కళలకు ఇచ్చిన ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. మనిషి సంతోషంగా జీవించాలంటే కళల పట్ల, తమకు ఉన్న అభిరుచుల పట్ల ఆసక్తితో వాటికి కూడా సమయం కేటాయించాలి, ఇవి మనకు కావాల్సిన మానసిక ఉల్లాసాన్ని ఇచ్చి మనలను ప్రశాంతంగా జీవించేలా చేస్తాయి. కనుక నిత్య యవ్వనం ఉండాలంటే పైన పేర్కొన్నవి పాటించి చూడండి.

## ఈ దోశ పిల్లలకు పెడితే.. ముక్క మిగల్చకుండా మొత్తం నాకేస్తారు, ఎలా చేసుకోవాలంటే?

గుడ్డు వంటకాలు అంటే పిల్లలకు చాలా ఇష్టం ఉంటుంది. గుడ్డుతో ఎలాంటి వంట చేసినా వారు చాలా ఇష్టంగా తింటూ ఉంటారు. కానీ ప్రతిసారీ ఆమ్లెట్ లేదా ఉడికించిన గుడ్డు ఇస్తే వారిలో దానిపై ఆసక్తి లేకుండా పోతుంది. మళ్ళీ దానివైపు చూడాలనే ఆశ కూడా పిల్లల్లో కలగదు. అందుకే అదే రుచిలో చిన్న మార్పులతో, కొత్త టచ్‌తో వంట చేస్తే మాత్రం వాళ్లు చక్కగా తినేస్తారు. అలాంటి వంటకం ఏదైనా ఉందా? అని అనుకుంటున్నారా? ఉందండీ అతి తక్కువ సమయంలో తయారయ్యే “ఎగ్ రోల్ దోసా”. ఈ రిసిపీ ఆరోగ్యానికి మేలు చేస్తుంది, పిల్లల జీర్ణవ్యవస్థకు సహాయపడుతుంది, ఫస్ట్ బైట్‌కి వాళ్ల నోరూరేలా చేస్తుంది. ఇప్పుడు దీన్ని ఎలా తయారుచేయాలో చూద్దాం!

ఎగ్ రోల్ దోశ తయారీకి కావాల్సిన పదార్థాలు: గోధుమ పిండి – 1 టేబుల్ స్పూన్ మిరియాల పొడి – చిటికెడు చిల్లీ ఫ్లేక్స్ – చిటికెడు కొత్తిమీర – తరిగినదిగా కొద్దిగా గుడ్డు – 1 ఉప్పు – రుచికి తగినంత నీరు – అవసరమైనంత చీజ్ లేదా నెయ్యి – తవా పై వేసేందుకు తురిమిన చీజ్ (ఐచ్ఛికం) – రోల్ కోసం.

ఎగ్ రోల్ దోశ తయారీ విధానం: ఒక గిన్నెలో గోధుమ పిండి తీసుకుని, దానిలో ఉప్పు, మిరియాల పొడి, చిల్లీ ఫ్లేక్స్ కలపాలి. ఇప్పుడు కొద్దిగా నీరు పోసి మిశ్రమాన్ని చిక్కగా కలపాలి. అందులో తరిగిన కొత్తిమీర, పగలగొట్టిన గుడ్డును వేసి బాగా గిలక్కొట్టాలి. ఈ మిశ్రమాన్ని 5 నిమిషాల పాటు పక్కన ఉంచాలి. ఇప్పుడు పాన్‌ను వేడి చేసి, దానిపై కొద్దిగా నెయ్యి లేదా చీజ్ వేయాలి. మిశ్రమాన్ని తవా మీద దోస మాదిరిగా వేసి రెండు వైపులా బాగా వేయించాలి.



దోస పూర్తిగా వేగిన తరువాత, తురిమిన చీజ్ వేసి గట్టిగా రోల్ చేయాలి. చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి పిల్లలకి అందించండి. కావాలంటే టొమాటో సాస్‌తో సర్వ్ చేయవచ్చు. కొన్ని చిట్కాలు: గుడ్డు మేనిదే తినలేని వారు, మినపపిండి మిశ్రమాన్ని వాడవచ్చు.

చీజ్‌కు బదులుగా తురిమిన పన్నీర్ వాడితే ఆరోగ్యపరంగా ఇంకా మంచిది. గోధుమ పిండికి బదులుగా శెనగపిండి వాడినా, రుచి అదిరిపోతుంది. పోషక విలువలు %డ% లాభాలు: గుడ్డులో ఉన్న ప్రోటీన్ పిల్లల ఎదుగుదలకి ఉపకరిస్తుంది. విటమిన్ %దీ%12, ఐరన్ మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. గోధుమ పిండి ఫైబర్ అధికంగా ఉండి, జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. కొత్తిమీరలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో టాక్సిన్లను తొలగించేందుకు తోడ్పడతాయి. చీజ్ లేదా పన్నీర్ వల్ల కాల్షియం, శక్తి మరియు ప్రోటీన్ అందుతుంది.

## వేసవిలో పర్ఫెక్ట్ కూర ఇదే..





అందరూ ఇష్టపడే ఉల్లిపాయ సమోసా..ఇంట్లోనే ఈజీగా ఇలా చేసుకుంటే క్రిస్పీగా సూపర్ గా వస్తాయి..

సమోసా అంటే తెలియని భారతీయులు ఉండరు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో దీనిని టేస్ట్ చేసే ఉండి ఉంటారు. అయితే చాలామంది దీనిని స్ట్రీట్ సైడ్ షాపుల్లోనే లేదా బేకరీల్లోనే కొనుక్కొనో లేదా జర్నీల్లో ఉన్న సమయంలో ఎవరైనా అమ్ముతుంటే కొనుక్కొని తిని ఉంటారు. వాస్తవానికి ఆఫీసుల్లో పనిచేసే చాలామంది ఉద్యోగులు సాయంత్రం పూట స్నాక్ గా తీసుకునే ఐటమ్స్ లో ఉల్లిపాయ సమోసా టాప్ ప్లేస్ లో ఉంటుంది. సౌతిండియాలో ఆనియన్ సమోసా ఫేమస్ కాగా..నార్త్ ఇండియాలో ఆలూ సమోసా ఎక్కువగా తింటారు. సౌతిండియాలో ఎక్కడైనా లభించే ఆనియర్ సమోసాని ఇంట్లోనే చాలా ఈజీగా తయారుచేసుకోవచ్చు. రోడ్డు పక్కన కొని తినే సమోసాలను మించిన టేస్ట్ ను కూడా పొందవచ్చు. ఇంట్లో అసలు ఈ ఆనియన్ సమోసా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

ఆనియన్ సమోసా తయారీకి కావలసిన పదార్థాలు –మైదా పిండి –నీరు –ఉల్లిపాయ –పచ్చిమిర్చి –చాట్ మసాలా –కొత్తిమీర –కారం –ఉప్పు –ఆయిల్

–తర్వాత పిండిని చపాతీ కర్రతో పలుచగా రోల్ చేసుకోవాలి. చపాతీలా చేసుకోవాలి. –ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి చపాతీని వేసి లైట్ గా కాల్చి తీసి పక్కన పెట్టుకోవాలి. –ఇప్పుడు మరో బౌల్ లో 2 స్పూన్ల మైదా పిండి, కొద్దిగా నీళ్లు పోసుకొని ఉండలు లేకుండా కలుపుకోవాలి. –ఇప్పుడు చపాతీలను అన్నీ ఒకదానిమీద ఒకటి వేసుకొని అన్ని సైడ్స్ కట్ చేసి స్క్వేయర్ షేపులో కట్ చేసుకోవాలి. తర్వాత వాటిని రెండు సమాన భాగాలుగా కట్ చేయాలి. –ఇంతకుముందు చపాతీలను కట్ చేసినప్పుడు మిగిలిన ఎడ్జెస్ చపాతీ పీసులను ఆయిల్ లో క్రిస్పీగా వేయించి పక్కనపెట్టుకోండి. –ఇప్పుడు స్టఫింగ్ కోసం.. ఓ బౌల్ లో ఉల్లిపాయల ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర, కారం, ఉప్పు, చాట్ మసాలా వేసి బాగా కలిపి ఇందులో వేయించిన చపాతీ ఎడ్జెస్ కొన్ని వేసి కలుపుకోవాలి. –తర్వాత స్క్వేయర్ షేపుల కట్ చేసిన చపాతీని తీసుకొని దాన్ని సమోసా షేపులో చుట్టుకొని మధ్యలో అందులో స్టపింగ్ పెట్టుకొని ఆయిల్ లో వేయించుకోవాలి. లైట్ గోల్డెన్ కలర్ వచ్చేవరకు వేయించుకుంటే క్రిస్పీ సమోసా రెడీ.

## నోరూరించే పచ్చిమామిడికాయ పకోడీ..



మీరు ఇప్పటిదాకా అనేక రకాల పకోడీ వెరైటీలను టేస్ట్ చేసి ఉంటారు. అయితే సమ్మర్ లో దొరికే పచ్చిమామిడికాయతో తయారుచేసే పకోడీ ఎప్పుడైనా తిన్నారా? యమా టేస్టీగా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలు దీన్ని చాలా ఇష్టంగా తింటారు. సాయంత్రం సమయంలో స్నాక్ ఐటమ్ గా ఇది తినడానికి చాలా చాలా బాగుంటుంది. పచ్చిమామిడికాయతో పకోడీని ఇంట్లోనే ఈజీగా ఎలా తయారుచేయాలి, దీని తయారీకి కావలసిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

మామిడికాయ పకోడీ తయారీకి కావలసిన పదార్థాలు –మామిడికాయ –మినపపిండి –మసాలా –తినే సోడా ఎఉల్లిపాయ –కారం –ఉప్పు –కరివేపాకు –కొత్తిమీర.

మామిడికాయ పకోడీ తయారీ విధానం –మీరు ఇప్పటిదాకా అనేక రకాల పకోడీ వెరైటీలను టేస్ట్ చేసి ఉంటారు. –ముందుగా పచ్చిమామిడికాయ తీసుకొని దాని పొట్టు తీసేయాలి. –తర్వాత ఆ మామిడికాయను కుడుకలు గీరే దానితో మంచిగా పొరలు పొరలుగా గీరుకోవాలి. –ఇప్పుడు ఓ గిన్నెలో మినపపిండి వేసి తురుముకున్న మామిడికాయ అందులో వేసుకోవాలి. –మీకు కావాలనుకుంటే మినపపండికి బదులు శనెగపిండి కూడా వాడచ్చు. –తర్వాత అందులో తగినంత కారం,ఉప్పు, 1 చెంచా మసాలా,చిటికెడు తినే సోడా,చిన్నగా తరిగిన 2 ఉల్లిగడ్డల ముక్కలు,4-5 రెమ్మల కరివేపాకు, కొద్దిగా కాడలతో సహా కొత్తిమీర వేసి మొత్తం కలిసేలా బాగా కలుపుకోవాలి. –అందులో సరిపడా నీళ్లు పోసుకుంటూ కలుపుకొని పక్కనపెట్టుకోవాలి. –తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి ఆయిల్ వేడి చెయ్యాలి. ఆయిల్ వేడెక్కిన తర్వాత అందులో కలిపి పెట్టుకున్న పిండిని చిన్న చిన్న ముద్దలుగా వేసుకోవాలి.

–ఎర్రగా కాలిన తర్వాత వాటాని దించేయాలి. అంతే మామిడికాయ పకోడీ రెడీ.

ప్రయోజనాలు పచ్చి మామిడికాయ పకోడీ రుచికరమైనది మాత్రమే కాకుండా కొన్ని ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. అయితే ఇది డీప్ ఫ్రై చేసిన ఆహారం కాబట్టి దాని ప్రయోజనాలు మితంగానే ఉంటాయి. పచ్చి మామిడికాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచడానికి, చర్మాన్మి ఆరోగ్యంగా ఉంచడానికి, శరీరంలో ఐరన్ శోషణకు ఉపయోగపడుతుంది. అలాగే పచ్చిమామిడికాయ కాలేయానికి రక్షణ కలిగిస్తుందని..కాలేయ పనితీరుని మెరుగుపరుస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. . అయితే పకోడీలను డీప్ ఫ్రై చేయడం వల్ల అవి ఎక్కువ నూనెను గ్రహిస్తాయి.. ఇది వాటి కేలరీల మొత్తాన్ని, కొవ్వు శాతాన్ని పెంచుతుంది. కాబట్టి పచ్చి మామిడికాయ పకోడీలను ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. మితంగానే వీటిని తినడం ఉత్తమం.

# సినిమా న్యూస్



# ఈసారి స్టైలిష్ లుక్కులో దివి గ్లామర్ డోస్



టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన ఫేమ్ తెచ్చుకున్న నటి దివి వధ్యకు సోషల్ మీడియా ద్వారా మంచి ఫ్యాన్ బేస్ ఏర్పడింది. 'బిగ్‌బాస్' షో ద్వారా దగ్గరైన దివి, ఆ తర్వాత లంబసింగి లాంటి సినిమాల్లో చిన్నచిన్న పాత్రల్లో మెరిసింది. కానీ తను ఎంచుకునే ఫోటోషూట్స్ ద్వారా మాత్రం ఎప్పటికప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్‌లో ఉండగలుగుతుంది. ఇటీవల దివి షేర్ చేసిన కొత్త ఫొటోషూట్ మాత్రం వేరే లెవెల్‌లో ఉండిపోయింది. లైట్ పింక్ శాటిన్ గౌన్‌లో ఆమె పోజులు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా హై స్లిట్ గౌన్‌లో ఆమె స్టెప్పులు, పోజులు ఆమెలోని ఫ్యాషన్ సెన్స్‌ను మరింత హైలైట్ చేశాయి. మ్యాచింగ్ ఈయరింగ్స్, కర్లీ హెయిర్ స్టైల్‌తో గ్లామర్‌కు మరో అర్థం చెప్పింది దివి.

కెమెరా ముందుకొచ్చిన ప్రతి ఫ్రేమ్‌లో ఆమె నమ్మకంగా కనిపించడం, నటిగా ఆమె ఎదుగుతున్న పరిణతి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ఫోటోలు తీసిన ఫోటోగ్రాఫర్ కూడా చాలా క్రాఫ్ట్‌ఫుల్‌గా ప్రతి షాట్‌ను డిజైన్ చేశాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ ఫోటోలు ఇప్పటికే 25 వేలకి పైగా లైక్స్‌ను అందుకున్నాయి. అభిమానుల నుంచి బ్యూటిఫుల్, గోర్జియస్ అంటూ కామెంట్స్ వెల్లువెత్తుతున్నాయి. దివి తన క్యాప్షన్ "ఆంఖోం సే లీజియే" అనే లైన్‌తో అభిమానులను ఫోజ్‌ఫుల్ మూడ్‌లోకి తీసుకెళ్లింది. ప్రస్తుతం దివి ఒక థ్రిల్లర్ సినిమాతో పాటు కొన్ని కొత్త వెబ్ ప్రాజెక్ట్స్‌లో భాగమవుతోంది. తన ఫ్యాషన్, గ్లామర్, నటన అన్నింటినీ సమపాళ్లలో మిక్స్ చేస్తూ... తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటోంది దివి వధ్య. మరి ఈ తరహా స్టైల్ లో అమ్మడు ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి.

# నా డ్రీమ్ కో స్టార్ అతనే!






హీరోయిన్లు అందరూ ఈ మధ్య తాము వర్క్ చేయాలనుకునే కో స్టార్ల గురించి చాలా ఓపెన్ గా మాట్లాడుతున్నారు. ఇప్పుడు టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే కూడా తన మనసులోని విషయాన్ని బయటపెట్టింది. తన సహజ నటనతో అందరినీ మెప్పించి, పక్కింటి అబ్బాయిలా అనిపించే హీరోతో తాను వర్క్ చేయాలనుకుంటున్నట్లు పూజా తెలిపింది. ఆ హీరో ఎవరో ఈ పాటికే అర్థమై ఉండాలి. పూజా నటించిన రెట్రో సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఆ సినిమా ప్రమోషన్స్ లో పూజా చాలా యాక్టివ్ గా పాల్గొంటుంది. ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పూజా తనకు నానితో కలిసి వర్క్ చేయాలనుందని, తన డ్రీమ్ కో స్టార్ నానినే అని తెలిపింది. వీరి కాంబినేషన్ లో సినిమా రావాలని చాలా మంది ఆశ పడుతున్న తరుణంలో పూజా నాని పేరు చెప్పడం అందరినీ ఎట్రాక్ట్ చేస్తుంది. రీసెంట్ గా ఓదెల2 ప్రీ రిలీజ్ ఈవెంట్ లో తమన్నా కూడా తాను శర్వానంద్ తో కలిసి వర్క్ చేయాలనుకుంటున్నట్టు బహిరంగంగా తెలపగా, ఇప్పుడు పూజా తన మనసులోని మాటను బయటపెట్టింది. ఇక రెట్రో విషయానికొస్తే కోలీవుడ్ స్టార్ హీరో సూర్యతో కలిసి పూజా చేస్తున్న మొదటి సినిమా ఇది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో పూజా ఇంతకుముందు పాత్రలకు భిన్నంగా మేకప్ లేకుండా డీ గ్లామర్ రోల్ లో కనిపిస్తుంది. ఇప్పటికే రిలీజైన రెట్రో ట్రైలర్ లో పూజా లుక్స్, ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, సూర్యతో పూజా కెమిస్ట్రీ అన్నీ చాలా కొత్తగా బాగా అనిపిస్తున్నాయి. సూర్య స్వీయ నిర్మాణంలో నిర్మించిన రెట్రోలో మంచి లవ్ స్టోరీతో పాటూ ఎమోషన్స్ కూడా ఉంటాయని ట్రైలర్ చూస్తుంటే తెలుస్తోంది. రెట్రో ప్రమోషన్స్ లో భాగంగా పూజాకు మీకు ఏ తెలుగు హీరోతో కలిసి వర్క్ చేయాలనుందనే ప్రశ్న ఎదురైంది. దానికి పూజా అసలే మాత్రం ఆలోచించకుండా కచ్చితంగా నాని నే అని చెప్పేసింది. నిన్ను కోరి సినిమాలో నాని యాక్టింగ్ అంటే తనకు చాలా ఇష్టమని, అతని యాక్టింగ్ లో ఏదో స్పెషల్ మ్యాజిక్ ఉంటుందని, అతనితో వర్క్ చేయడం ఈజీగా, సరదాగా ఉంటుందని కూడా తాను విన్నానని, నానిపై తనకున్న అభిమానాన్ని బయటపెట్టింది పూజా హెగ్డే. పూజా నానితో స్క్రీన్ షేర్ చేసుకోవాలనుందని చెప్పి ఆమె ఫ్యాన్స్ లో మరియు ఫిల్మ్ మేకర్స్ లో కొత్త ఇంట్రెస్ట్ ను కలిగించింది. మరి నానితో యాక్ట్ చేయాలనే పూజా కల త్వరలోనే తీరుతుందా లేదా దానికి ఇంకా టైమ్ పడుతుందా అనేది చూడాలి. మొత్తానికి రెట్రో ఇంటర్వ్యూల్లో అందరికంటే ఎక్కువ యాక్టివ్ గా ఉంటున్న పూజా పలు విషయాల వల్ల వార్తల్లో నిలుస్తూ ఆ కష్టానికి తగ్గ గుర్తింపు కూడా అందుకుంటుంది.

# 'అనారోగ్యం వల్లే భర్తలు అలా!'.. ఆ పోస్ట్ కు సమంత లైక్



స్టార్ హీరోయిన్ సమంత... సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటున్న విషయం తెలిసిందే. తన పాడ్ కాస్ట్ ద్వారా ఎన్నో ఉపయోగకరమైన విషయాలను షేర్ చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు హెల్త్, ఉమెన్ ప్రొటక్షన్, రిలేషన్స్ సహా వివిధ అంశాలకు సంబంధించిన పోస్టులు పెడుతూనే ఉన్నారు. తనకు నచ్చిన పోస్టులకు లైక్స్ కూడా కొడుతున్నారు. తాజాగా ఓ పోస్ట్ కు లైక్ చేసి వార్తల్లో నిలిచారు సామ్. అనారోగ్యంతో ఉన్న భార్యను వదిలించుకోవడానికే భర్తలు మొగ్గు చూపుతున్నారంటూ వచ్చిన సర్వేకు సంబంధించిన పోస్ట్ కు ఆమె లైక్ చేయడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మొత్తం 60 వేల మందికిపైగా ఆ పోస్ట్ కు లైక్ కొట్టగా.. కేవలం సమంత చర్యపైనే అంతా మాట్లాడుకుంటున్నారు. "లైఫ్ పార్టనర్ తీవ్ర అనారోగ్యం పాలైతే చాలుఆమెను వదిలేయడానికి భర్తలు చూస్తున్నారు.

# యాక్టింగ్.. నా బ్లడ్ లోనే ఉంది



హిట్లర్, అల్లుడా మజాకా, భైరవ దీపం, బావగారు బాగున్నారా వంటి సూపర్ హిట్ చిత్రాలతో 90వ దశకంలో టాలీవుడ్‌ను ఒక ఊపు ఊపేసిన హీరోయిన్ రంభ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటుంది. 2007లో వచ్చిన యమదొంగ సినిమాలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ పక్కన ఐటం సాంగ్‌లో మరోసారి తన అందాలతో తెలుగు ప్రేక్షకుల మనసులు దోచేసిన ఈ భామ చివరిగా 2010లో విడుదలైన దేవి చిత్రంలో కనిపించింది. మళ్లీ చాలా లాంగ్ గ్యాప్ తర్వాత ప్రస్తుతం టీవీ షోల్లో జడ్జిగా తళుక్కుమంటున్న రంభ తన సెకెండ్ ఇన్నింగ్స్ విశేషాలను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలింది. 2010లో శ్రీలంకకు చెందిన తమిళ వ్యాపారవేత్త ఇంద్రకుమార్‌ను పెళ్లి చేసుకుని కెనడాలో స్థిరపడిన ఈ బెజవాడ ముద్దుగుమ్మ చివరిసారి వెండి తెరపైన కనిపించి 15 ఏళ్లు అవుతోంది. రంభకు ప్రస్తుతం ముగ్గురు పిల్లలు. వారి సంరక్షణ బాధ్యతలను చూసుకునేందుకు నటనకు దూరమయ్యానని చెప్పిన రంభ, ఇప్పుడు వాళ్లు పెద్దవాళ్లయ్యారని, వారి పనులు వారు చేసుకోగలుగుతున్నారని తెలిపింది. యాక్టింగ్ అంటే తనకు ఎంత ఇష్టమో భర్త ఇంద్రకుమార్‌కు తెలుసని, ఆయన మద్దతుతోనే టీవీ షోస్ ద్వారా సెకెండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించానని చెప్పింది.ఒక దశలో ఈ షోలో తాను చేయగలనా అని తనపై తనకే అనుమానం వచ్చిన సమయంలో కుటుంబమంతా కలిసికట్టుగా తనని ప్రోత్సహించిందని తెలిపింది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH, Karimnagar (Dist.), Telangana-505001, Editor: PENAGONDA SATHISH. RNI.No. T/TG/2024/0523/7229/1544 Cell: 8333818121, email: akankshanewsdaily@gmail.com